నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట, ఫిబ్రవరి 5 : చంపాపేట సబ్‌స్టేషన్, సుల్తాన్ వాల్వా 11 కేవీ ఫీడర్ పరిధిలోని చంపాపేట మజీద్ గల్లీ, సుల్తాన్ వాల్వా, కటికోని కుంట సాయి రామ్ నగర్ కాలనీ, చంపాపేట మెయిన్ రోడ్ ప్రాంతాల్లో మరమ్మతులు చేపట్టనున్నారు. దాంతో గురువారం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడనున్నదని ఏఈ శ్రీనివాస్ తెలిపారు.

ఆర్కేపురం : లక్ష్మీగణపతి, తట్టిఅన్నారం, టీఎస్ హౌసింగ్ బోర్డు 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం దిగువ ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందని సరూర్‌నగర్ డీఈ కె.కె.రామకృష్ణ తెలిపారు. లక్ష్మీగణపతి ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంటల వరకు జె.కన్వెక్షన్‌హాల్, లక్ష్మీగణపతి కాలనీ పరిసర ప్రాంతాలు. తట్టిఅన్నారం ఫీడర్ పరిధిలో తట్టిఅన్నారం, ఆర్కే నగర్, వనస్థలి హిల్స్, కుత్బుల్లాపూర్, తిమ్మాయిగూడ, మర్రిపల్లి పరిసర ప్రాంతాలు. టీఎస్ హౌసింగ్ బోర్డు ఫీడర్ పరిధిలో ఇందూ అరణ్య అపార్ట్‌మెంట్స్, ఇందూ అరణ్య విల్లాస్ పరిసర ప్రాంతాలు.

బీసీలకు అన్యాయం

కందుకూరు, ఫిబ్రవరి 5 : బీసీలకు అన్యాయం జరుగుతున్నదని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మన్నె జయేందర్ ముదిరాజ్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. కులగణన సర్వే తప్పుల తడకగా ఉందని, బీసీల జనాభా ఎలా తగ్గుతుందని ప్రశ్నించారు. లెక్కలు కూడా తగ్గాయని, లోపాలను గుర్తించి వాటిని సవరించేందుకు మళ్లీ సర్వే జరిపించాలని కోరారు. పదేండ్లలో కేవలం 2 లక్షలు మాత్రమే పెరిగిందని పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. 2011 జనాభా ప్రకారం సమగ్ర కులగణన చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీసీ నాయకులు పాల్గొన్నారు.

క్రీడలతోనే.. మానసిక ఉల్లాసం

ఆర్కేపురం, ఫిబ్రవరి 5 : క్రీడలు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. బుధవారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్పోర్ట్స్ మీట్-2025 కు ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడలతో శరీర దారుఢ్యం కలుగుతుందని, చిన్నతనం నుంచే ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని, క్రీడా పోటీల్లో ప్రతిఒక్కరూ గెలుపు ఓటములను పట్టించుకోకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. క్రీడల్లో ముందుకు సాగాలంటే సాధన ముఖ్యమని చెప్పారు. క్రీడల్లో రాణింపుతో నలుగురిలో గుర్తింపుతో పాటు రాష్ట్రం, దేశానికి ప్రాతినిధ్యం వహించే అరుదైన గౌరవం దక్కుతుందన్నారు. అన్ని పాఠశాలల యజమాన్యాలు విద్యార్థులను క్రీడల్లో రాణించే విధంగా ప్రోత్సహించాలన్నారు. కార్యక్రమంలో తెలంగాణ యాంటీ నార్కొటిక్స్ డ్రగ్ బ్యూరో డీఎస్పీ సుబ్బరామి రెడ్డి, జిల్లా క్రీడా అధికారి వెంకటేశ్వర్‌రావు, బడ్జెట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపతి శేఖర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షులు నారాయణ రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్ రావు, మీనేందర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, దేవేందర్‌గౌడ్, మధుసూదన్‌రెడ్డి, లోకసాని కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

జెండా ఊపి క్రీడలను ప్రారంభిస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

వర్గీకరణ ఘనత మందకృష్ణ మాదిగదే

మలక్‌పేట, ఫిబ్రవరి 5 : ఎస్సీవర్గీకరణ ద్వారానే ఉపకులాల అభివృద్ధి సాధ్యమని ముప్పైఏండ్లుగా అలుపెరుగని పోరాటం చేసి సాధించిన మంద కృష్ణ మాదిగకే దక్కుతుందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టు దాసురావు మాదిగ అన్నారు. ఎస్సీ వర్గీకరణను సాధించిన సందర్భాన్ని పురస్కరించుకొని బుధవారం మంద కృష్ణను తన కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందజేసి, శాలువతో సన్మానించారు. వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు ఎమ్మార్పీఎస్‌ను స్థాపించి మాదిగ జాతిని ఏకతాటిపైకి తెచ్చిన ఘనత మంద కృష్ణకే దక్కుతుందన్నారు. వర్గీకరణను అడ్డుకునేందుకు మాలలు సర్వశక్తులు ఒడ్డారని, అయినా దేనికి బెదరకుండా వర్గీకరణ ఆవశ్యకతను జాతీయస్థాయిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల, దేశ సర్వోన్నత న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లి, సుప్రీంకోర్టు ద్వారానే మార్గం సుగమమం చేసిన దళితరత్నం మంద కృష్ణ మాదిగ అని పేర్కొన్నారు.

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు అభినందనలు తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పాపయ్య మాదిగ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాసురావు మాదిగ

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి

కందుకూరు కార్యాలయంలో మాట్లాడుతున్న ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 5 : స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని కందుకూరు ఆర్డీవో జగదీశ్వర్ రెడ్డి తెలిపారు. పోలింగ్‌బూత్‌ల్లో ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. బుధవారం తన కార్యాలయంలో కందుకూరు, మహేశ్వరం, కడ్తాల్, ఆమనగల్లు, తలకొండపల్లి తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంపీఎచ్ఓలతో ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎల్‌పీఓ లక్ష్మీనారాయణతో కలిసి మాట్లాడుతూ.. పోలింగ్‌బూత్‌ల్లో ఏర్పాట్లు, వసతులు కల్పించాలని, ఓటర్ లిస్టుల్లో పొరపాట్లు లేకుండా చూసుకోవాలని సూచించారు. దివ్యాంగులకు ర్యాంపుల ఏర్పాటు, తాగునీరు, విద్యుత్, కల్పించాలన్నారు.

ఎన్నికల సిబ్బందిని నియమించాలని, శిక్షణ ఇవ్వాలని పేర్కొన్నారు. ఎన్నికలు స్వేచ్ఛగా, శాంతియుతంగా నిర్వహించడానికి కృషి చేయాలని కోరారు. ఏ క్షణంలోనైన నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దారు గోపాల్, నాయబ్ తహసీల్దారు శేఖర్, ఎంపీడీఓ సరిత, పాల్గొన్నారు.

టోర్నమెంట్‌ను విజయవంతం చేయండి

వనస్థలిపురం : రంగారెడ్డి జిల్లా క్యారమ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే క్యారమ్స్ టోర్నమెంట్‌ను విజయవంతం చేయాలని సంస్థ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి సాయికృష్ణ, ఉపాధ్యక్షుడు పోగుల రాంబాబు కోరారు. ఈ నెల 15 నుంచి 18 వరకు మన్సూరాబాద్‌లోని మల్లికార్జున నగర్ కమ్యూనిటీహాల్‌లో టోర్నమెంట్ జరుగుతుందన్నారు. పురుషులు, మహిళలు, వెటరన్ సింగిల్స్, పురుషుల డబుల్స్ విభాగంలో పోటీలు ఉంటాయన్నారు. బయటి జిల్లాల నుంచి వచ్చే క్రీడాకారులకు ఉచిత భోజనం, వసతి కల్పించామన్నారు. 11 లోగా పేరు రిజిస్టర్ చేయించుకోవాలని సూచించారు. వివరాలకు 98485 46234, 94403 07023 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణ కాంగ్రెస్‌తోనే సాధ్యం

ఆర్కేపురం : ఎస్సీ వర్గీకరణ కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతోందని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు అన్నారు. బుధవారం సరూర్‌నగర్ డివిజన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దళితులకు సంబంధించి ఆర్థిక, సామాజిక, విద్య, రాజకీయపరంగా ఏం చేస్తే బాగుంటుందో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సలహాలు, సూచనలు ఇస్తే బాగుటుందన్నారు. ఎస్సీ వర్గీకరణతో పాటు బీసీ కులగణనపై చర్చించేందుకు మాజీ సీఎం కేసీఆర్ అసెంబ్లీకి వస్తే బాగుటుందన్నారు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీ ఇచ్చిన మాట ప్రకారం కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం కులగణన చేయడమే కాక ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తుందన్నారు. కార్యక్రమంతో విష్ణుదాస్ వంశీ ఉన్నారు.

బీసీలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

వనస్థలిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న వాసుదేవ్

వనస్థలిపురం : బీసీపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని బీసీ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షుడు కోట్ల వాసుదేవ్ అన్నారు. మహేశ్ రెడ్డి, మల్లారెడ్డి సోషల్ మీడియాలో బీసీలను కించపరిచే విధంగా కామెంట్లు చేశారన్నారు. వారిపై బుధవారం వనస్థలిపురం పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఆయన మాట్లాడుతూ.. బీసీలను అణిచివేయాలని చూస్తే సహించేది లేదన్నారు. రాజకీయ చైతన్యంతో ముందుకు సాగుతున్న బీసీల స్ఫూర్తిని దెబ్బతీసేందుకు కొందరు కుట్రలు చేస్తున్నారన్నారు. సభ్య సమాజంలో చెప్పలేని విధంగా సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారన్నారు. అలాంటి వారిని వదిలిపెట్టే ప్రసక్తి లేదన్నారు. వారిపై డీజీపీకి కూడా ఫిర్యాదు చేశామన్నారు.

డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి

మండల సమైక్య భవనంలో డ్వాక్రా సంఘాల సమావేశం

కందుకూరు, ఫిబ్రవరి 5 : డ్వాక్రా సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నట్లు రంగారెడ్డి జిల్లా డీఏఆర్‌డీఏ పీడీ శ్రీలత తెలిపారు. బుధవారం మండల సమైక్య భవనంలో డ్వాక్రా సంఘాల సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. డ్వాక్రా మహిళలు ఆర్థికంగా ఎదుగాలని కోరారు. డ్వాక్రా మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కెనరా బ్యాంక్ నేదునూరు బ్రాంచి వారు రూ. 76,500 డొనేట్ చేశారు. బ్యాంకుల్లో తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని కోరారు.

కార్యక్రమంలో ఏపీఎం కవిత, ఏజీఎం డీపీఎం బాల్‌రాజ్, అక్షయమూర్తి, గణేశ్, మైసయ్య, ప్రభాకర్, యాదయ్య, శ్రీహరి, ధనలక్ష్మి, హైమావతి, రాజేశ్వరి, అధ్యక్షురాలు కుంచం విత, కవిత, ఓబీలు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘం నివేదికను ప్రారంభిస్తున్న రంగారెడ్డి జిల్లా డీఏఆర్‌డీఏ పీడీ శ్రీలత

బీసీలను ప్రభుత్వం మోసం చేస్తున్నది

సైదాబాద్, ఫిబ్రవరి 5 : కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలను మోసం చేస్తున్నదని నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ అన్నారు. బుధవారం ఆయన సైదాబాద్‌లోని నివాసంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. బీసీ కులగణన పేరుతో బీసీల జనాభాను తగ్గించటంతో పాటు, అగ్రవర్ణాల సంఖ్య పెరుగటంపై అనుమానాలు వ్యక్తమౌతున్నాయన్నారు. ప్రభుత్వం నిర్వహించిన సర్వేతో బీసీలకు అన్నివిధాలుగా అన్యాయం జరుగుతుందన్నారు. ఫిబ్రవరి 4వ తేదీని సోషల్ జస్టిస్ దినమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని, సోషల్ జస్టిస్ దినం కాదని, బీసీ వర్గాల వ్యతిరేక దినమని అన్నారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బీసీ జనాభా లెక్కలతో బీసీలకు మరింతగా అన్యాయం జరుగుతుందని, వారికి సామాజిక న్యాయం జరుగదన్నారు. రేవంత్ రెడ్డికి బీసీ ప్రజలపై చిత్తశుద్ధి ఉంటే సరైన ప్రణాళికతో బీసీలకు న్యాయం చేసేలా చూడాలన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలో కోటిన్నర మంది జనాభా ఉంటే, 50 శాతం కూడా సర్వే సక్రమంగా సర్వే సరిగ్గా జరుగలేదని, దీంతో బీసీలకు ప్రభుత్వం తీరని మోసం చేస్తుందని ఆరోపించారు.

మీడియాతో మాట్లాడుతున్న నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్ చందర్జీ

పేదవిద్యార్థుల సంక్షేమానికి కృషిచేయాలి

పేద విద్యార్థుల సంక్షేమానికి కృషి చేయాలని కెనరా బ్యాంక్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ అక్షయమూర్తి తెలిపారు. రాచులూరు బ్రాంచ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలకు కమ్యూనిటీ సోషల్ ఆక్టివిటీస్ కింద రూ.30వేలతో అల్మారాలను విరాళంగా ఇచ్చి, వాటిని బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్ఎం దేవేందర్‌రెడ్డి, బ్రాంచ్ మేనేజర్ కరుణాకర్, ఉపాధ్యాయులు, బ్యాంక్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

- కందుకూరు

ఆధునిక బోధనతో నాణ్యమైన విద్య

అధ్యాపకులకు ఆధునిక బోధనా పద్ధతులపై అవగాహన కల్పిస్తున్న వక్త రాజేశ్ పెర్షాద్

మలక్‌పేట : ఆధునిక బోధనా పద్ధతులపై అధ్యాపకులకు శిక్షణను ఇవ్వడం ద్వారా నాణ్యమైన విద్య అందించగలుగుతారని రాజేశ్ పెర్షాద్ అన్నారు. సాంకేతికత, సమయపాలన కలిసి వస్తాయని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతుందన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లోని నోబుల్ డిగ్రీ కళాశాలలో 'ఎఫ్‌డీసీ అధ్యాపక అభివృద్ధి కార్యక్రమం' అంశంపై వీయూసీఏ ప్రపంచం అనే సందేశంతో ఆధునిక బోధనా పద్ధతులతో సాంకేతికత, సమయపాలన, శ్రద్ధ, దీక్ష అంశాలపై అధ్యాపకులకు అవగాహన కల్పించారు. నోబుల్ విద్యాసంస్థల చైర్మన్ ఆర్.రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. నాణ్యమైన విద్యను అందించి సమాజాభివృద్ధికి దోహదపడేలా తీర్చిదిద్దవచ్చునన్నారు. విద్యా పర్యావరణ వ్యవస్థలను అభివృద్ధి పరచటానికి ఎఫ్‌డీసీ కార్యక్రమం దోహదపడనుందని కళాశాల ప్రధాన అధ్యాపకులు విఠల్ పార్థసారథి అన్నారు. కార్యక్రమంలో నోబుల్ డిగ్రీ కళాశాల, నవ్య జూనియర్ కళాశాలల విభాగాల అధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యం

మేడారం శ్రీనివాస్

ఇర్పో ఫిరంగి దుర్వ

హయత్‌నగర్, ఫిబ్రవరి 5 : వేర్వేరు ఘటనల్లో ఇద్దరు అదృశ్యమైన ఘటన హయత్‌నగర్ పీఎస్ పరిధిలో బుధవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, మనగనూరు, టెలిఫోన్ కాలనీకి చెందిన కార్పెంటర్ మేడారం శ్రీనివాస్ ఈ నెల 3న ఇంట్లో గొడవ పెట్టుకుని మరుసటి రోజు ఉదయం బయటికి వెళ్లాడు. శ్రీనివాస్ సాయంత్రానికి తిరిగి రాకపోవడంతో ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం చుట్టుపక్కల, బంధువుల వద్ద వెతికినా దొరకలేదు.

మరో ఘటనలో వ్యక్తి..

అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, కోహెడలో ఉంటున్న శంకర్ రంజిత్ రామ్ సెంట్రింగ్ పనుల నిమిత్తం ఇర్పో ఫిరంగి దుర్వను నారాయణ కళాశాల వద్ద చిట్టిబలిజ రామచంద్రం దగ్గరకు తీసుకొచ్చాడు. గత నెల 28 నుంచి ఇర్పో ఫిరంగి దుర్వ కనిపించడం లేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ఆచూకీ కోసం వెతికినా దొరకలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిషేధిత విదేశీ సిగరెట్లను విక్రయిస్తున్న వ్యక్తి అరెస్ట్

మలక్‌పేట : ఎలాంటి లైసెన్స్, బిల్లులు లేకుండా నిషేధిత విదేశీ సిగరెట్లను విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు, అతడి వద్ద నుంచి విదేశీ సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. చాదర్‌ఘాట్ పోలీసుల కథనం ప్రకారం.. చాదర్‌ఘాట్ పీఎస్ పరిధిలోని పాత మలక్‌పేట డివిజన్ వాహెద్‌నగర్‌లో నిషేధిత విదేశీ సిగరేట్లను విక్రయిస్తున్నారన్న విశ్వసనీయ సమాచారాన్ని అందుకున్న నార్త్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్థావరంపై దాడి చేసి పఠాన్ యూసుఫ్ మహ్మద్‌ఖాన్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి 450 (4500 సిగరెట్లు) విదేశీ సిగరెట్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని చాదరఘాట్ పోలీసులకు అప్పగించారు. టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి పఠాన్ యూసుఫ్ మహ్మద్‌ఖాన్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

సృజనాత్మకత పెంపొందించుకోవాలి

హయత్‌నగర్ :విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేశ్ బాబు సూచించారు. బుధవారం తెలంగాణ ప్రభుత్వం, కళాశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు హయత్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 'యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్' కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థుల మంచి ఆలోచనలు నూతన ఆవిష్కరణలకు తోడ్పడతాయని, వ్యాపార దృక్పథం ఉన్న ఆలోచనలు మనకు ఆదాయాన్ని కూడా సమకూరుస్తాయన్నారు. వైఎఫ్ఎస్ఐ కో - ఆర్డినేటర్ డాక్టర్ ఈ.యాదగిరిరెడ్డి, వైఎఫ్ఎస్ఐ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్, ఆలోచనలను సమర్పించడంపై విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వి.ఇందిర, అకాడమిక్ కో - ఆర్డినేటర్ డాక్టర్ బి.నరసింహా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎస్.శారదాదేవి, టీఎస్ కేసీ మెంటార్ నాగరాజు, వెంకట్, విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ పి.సురేశ్‌బాబు

మాట్లాడుతున్న ఇబ్రహీంపట్నం ఏసీబీ రాజు

చెడు వ్యసనాలకు లోనుకావొద్దు

కందుకూరు, ఫిబ్రవరి 5 : యువత చెడు వ్యసనాలకు లోనుకావొద్దని ఇబ్రహీంపట్నం ఏసీబీ రాజు తెలిపారు. ఆకులమైలారం గ్రామంలో అవగాహన సదస్సులో మాట్లాడుతూ.. ఆన్‌లైన్ గేములు, డ్రగ్స్‌వంటి మత్తు పదార్థాలకు లోను కావద్దని కోరారు. చెడు అలవాట్లకు లోనై బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని సూచించారు. పేకాట, జూదం ఆడవద్దని, ఆపద సమయంలో 100కు ఫోన్ చేయాలని సూచించారు. యువకులను ప్రభుత్వ సహకారంతో ఆర్థికంగా ఎదుగాలని కోరారు. కార్యక్రమంలో గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్‌స్టేషన్ ఎస్సై తేజంరెడ్డి, గొరిగే రాజు, పాండు, పోలీస్ సిబ్బంది, యువకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చెరువులో మృతదేహం లభ్యం

ఎల్బీనగర్, ఫిబ్రవరి 5 : సరూర్‌నగర్ చెరువు భవానీశంకర్ దేవాలయం వెనుకవైపు చెరువు నాలాలో ఓ వ్యక్తి మృతదేహాన్ని సరూర్‌నగర్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. బుధవారం ఉదయం సరూర్‌నగర్ చెరువులో ఓ వ్యక్తి మృతదేహం ఉందని వచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని చెరువులో నుంచి మృతదేహాన్ని బయటకు తీసి విచారించారు. సదరు వ్యక్తి దుస్తువుల్లో లభించిన ఆధార్ కార్డు ఆధారంగా మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ ప్రాంతానికి చెందిన నాగమల్ల బాల్‌రాజ్ (60)గా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించి.. అనంతరం వారి బంధువులకు అప్పగించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మలక్‌పేట : జీతాలు చెల్లించాలని నేడు రెండోరోజు టీవీవీపీ దవాఖానల్లో కొనసాగిన ధర్నా కార్యక్రమాలు

ప్రభుత్వం మాలలకు అన్యాయం చేసింది

ఎల్బీనగర్, ఫిబ్రవరి 5 : ఎస్సీ వర్గీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మాలలకు అన్యాయం చేసిందని మన మాలల సొసైటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పార్శపు శ్రీధర్, రాష్ట్ర నాయకుడు ఎన్. బిక్షపతి ఆరోపించారు. ఎస్సీల రిజర్వేషన్లను 20 శాతానికి పెంచాల్సింది పోయి 2011 నాటి జనాభా లెక్కలను చూపుతూ.. తాజా అంశాలను పట్టించుకోకుండా వర్గీకరణ చేయడం, మాలలకు కేవలం 5 శాతం మాత్రమే ఇస్తున్నట్లు పేర్కొనడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. తాజా కులగణనలో తేలిన మాల, మాదిగ లెక్కలను బహిర్గతం చేయాలన్నారు. పెరగాల్సిన ఎస్సీల జనాభా తగ్గిపోవడం, బీసీల జనాభా తగ్గిపోవడాన్ని బట్టి చూస్తే అధికార పార్టీకి ఈ విషయంలో చిత్తశుద్ధి లేదని స్పష్టం అవుతోందన్నారు. మాలలకు అన్యాయం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి సర్కార్‌పై రాష్ట్రవ్యాప్తంగా నిరసన వేగవంతం చేస్తామని వారు హెచ్చరించారు.

చెట్టుకు ఉరేసుకొని వ్యక్తి..

బడంగ్‌పేట, ఫిబ్రవరి 5 : ఓ వ్యక్తి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన మీర్‌పేట పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. సీఐ నాగరాజు కథనం ప్రకారం.. మీర్‌పేట మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాతనగరానికి చెందిన వెంకటేశ్ (50) సర్వోదయ కాలనీ పరిధిలో ఉన్న మంత్రాలచెరువు దగ్గర చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. వెంకటేశ్‌కు భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ప్లంబర్ పనిచేసే అతడు మద్యానికి బానిస అయినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య వాణి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలి

మలక్‌పేట : ఎస్‌బీఐ కాలనీ పార్కు అభివృద్ధి పనుల్లో నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని కార్పొరేటర్ భాగ్యలక్ష్మీ మధుసూదన్‌రెడ్డి కాంట్రాక్టర్, వర్కర్లకు సూచించారు. పార్కులో జరుగుతున్న అభివృద్ధి, సుందరీకరణ పనులను కాంట్రాక్టర్, జీహెచ్ఎంసీ అధికారులతో పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈ శరత్, సైట్ ఇంజినీర్ ఏడుకొండలు, టీచర్ శశికళ, మల్లికార్జున్, సం తోష్, పరుశురాం, ఉమేశ్, సాయి పాల్గొన్నారు.

మన్సూరాబాద్, ఫిబ్రవరి 5 : శ్రీరామ్ నగర్ కాలనీలోని నాగార్జున మాంటిస్సోరి ఐఐటీ ఒలింపియాడ్ స్కూల్ వార్షికోత్సవం బుధవారం సాయంత్రం ఎంఈ రెడ్డి గార్డెన్‌లో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గత విద్యా సంవత్సరం పదోతరగతిలో జీపీఏ 10 పాయింట్లు సాధించిన ఆరుగురు విద్యార్థులకు ఒక్కక్కరికి రూ. 10 వేలు, జ్ఞాపిక అందజేశారు.

కార్యక్రమంలో విద్యా సంస్థల చైర్మన్ గుమ్మకొండ విఠల్‌రెడ్డి, వైస్‌చైర్‌పర్సన్ జి. రజినీ విఠల్‌రెడ్డి, సీఏఓ ఏ శేషారావు, అకాడమిక్ డీన్ ఎస్. రాజశేఖర్, పాఠశాల ప్రిన్సిపాల్ మురళి, ఇన్‌చార్జిలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.